# పూరయ మమ కామం

ఆ గది వంకనే చూస్తూ చాలాసేపు కూర్చున్నది శ్రీదేవి.

భర్త పిలుపు రావడంతో విసుగ్గాలేచి, 'ఏమిటి? ఏం కొంపమునిగింది?' అని అరుస్తూ లోపలికి వెళ్ళింది. ఆమె భర్త చేతిలో పేపరుతో గుమ్మంలో నిలబడిఉండి రెండో చేత్తో కళ్ళజోడు సర్దుకుంటూ నసుగుతున్నట్టు 'పిల్లాడి ఏడుపు వినిపించడం లేదూ?' అన్నాడు.

శ్రీదేవి రుసరుసలాడుతూ "పెద్దపిల్ల ఎక్కడ చచ్చింది? వెధవగోల. వీళ్ళను సముదాయించలేక ఛస్తున్నాను" అంటూ క్రింద కటిక నేలమీద బోర్లా పడుకుని ఏడుస్తున్న పసివాణ్ణి ఎత్తుకుంది. వాడు అంతలోనే ఏడుపుమాని తల్లి భుజం మీద తలవాల్చాడు.

శ్రీదేవి మళ్ళీ పెరటి గుమ్మంలోకి వచ్చి పక్క డాబా మీది ఆ గది వంకనే చూస్తూ కూర్చుండిపోయింది.

ఆమె పతీసుత సమేతంగా పుట్టింటికి వచ్చి రెండు రోజులైంది. బహు అరుదుగా దొరికిన సెలవును పుట్టింట గడపాలని వచ్చింది. జన్మభూమికి వందలాది మైళ్ళ దూరంలో ఎక్కడో ఇన్నేళ్ళుగా వుండిపోయారు. ఏ పండుగకు పబ్బానికీ అనుకున్న వెంటనే బయలుదేరి రావడానికి వీల్లేదు. అక్కడ ఆయనగారి ఉద్యోగం అలాంటిది తాను ఒక్కక్షణం లేకపోతే బ్రహ్మాండమైన ఆ ఉక్కు ఫ్యాక్టరీలో యంత్రాలు నడవ్వని ఆయనగారి భ్రమ. పైగా, ఏదన్నా వీలు దొరికినా వందలొందలు పోసి అంతదూరం వెళ్ళి బావుకునే దేమిటిలే అని తాత్సారం.

అయితే ఎప్పుడూ అలా వుండలేరు కదా? ఇప్పటికి రావడం కుదిరింది.

శ్రీదేవి ఆ గది వంకనే చూస్తున్నది మళ్ళీ.

అది డాబా మీద ఒంటరి గది. విశాలంగానే వుంటుంది. ముందు సన్నని వరండా. వరండా స్తంభం పక్కన రెండు పూలకుండీలు, ఖాళీ స్థలం. సన్నటి పిట్టగోడ, దానిమీదగా పెరిగిన పెద్ద బాదంచెట్టు, ఆ గది నిర్మాణం జరుగుతున్నప్పుడు తనకు పద్దెనిమి దేళ్ళుంటాయేమో? ఆ కట్టడం పూర్తయ్యాక ఆ యింటి యజమానురాలు విశాలాక్షమ్మ తమ యింటికి వచ్చి మాటల సందర్భంలో శ్రీదేవి తల్లితో 'అన్నట్టు చెప్పడం మరిచాను. మా. పై గది అద్దెకిచ్చానమ్మా! నెలకు యాభై రూపాయిలు అన్నది. శ్రీదేవి తల్లి 'ఒంటి గది కాపురాని కేం సరిపోతుందండీ!' అని అడిగింది. "కాపురానిక్కాదు ఒక్కడే అబ్బాయి. యూనివర్సిటీలో చదువుకుంటున్నాట్ట... ఆఖరి సంవత్సరం... హాస్టల్లో అయితే చదువు సాగదని విడిగా వుండాలని వచ్చాడు. బుద్ధిమంతుల్లాగే వున్నాడు. వాళ్ళ ఊళ్ళో పొలాలు తోటలూ వున్నాయని చెప్పాడు. నెల అద్దె అడ్వాన్సుగా కూడా యిచ్చి వెళ్ళాడు. ఎల్లుండి మంచిరోజు రమ్మన్నాను" అన్నది విశాలాక్షమ్మ. శ్రీదేవి అప్పుడు అక్కడే నిలబడివుంది. ఆమె లేత మనస్సులో ఒక యవనిక తొలగి ఒక ఆకారం ప్రత్యక్షమైంది, పలుచగా,

ఎర్రగా లేతముఖంతో నూనూగు మీసాలతో అందాలుచిందే ఒక అబ్బాయి ముఖం,తీర్చిదిద్దినట్లున్న కళ్ళూ, ముక్కూ ముక్కు మీద పలుచటి కళ్ళజోడు, మాటిమాటికీ ముఖానపడే క్రాఫూ.

శ్రీదేని అప్పుడు వయసు తెచ్చిన పొంగులతో పూలరధంలా వుండేది. మధ్య తరగతి కుటుంబంలో, అందునా హైస్కూలు టీచరు యింట పుట్టిన యిద్దరు మగ పిల్లలు తరువాతది కావడం వల్ల తల్లితండ్రులూ, అన్నలూ తర్వాత వదినలు కూడా గారాబంగా చూసేవారు. అపురూపంగా చూసేవారు. నేస్తురాళ్ళందరూ ఒక మోస్తరు శ్రీమంతుల పిల్లలు. సహజంగానే కాస్త తీరిక చిక్కితే కలలు కంటూ వుండేది. అలా అని చదువు ఉపేక్షించిందని కాదు. ఎస్సెల్సీ మొదటిసారే పాసయింది. పెద్దలూ, వారూ వీరూ,"ఇంట్లో ఈడొచ్చిన పిల్లవుంది" అనుకోవడం, "మంచి యింట మంచి సంబంధం చూసి ఆ ముచ్చట కాస్తా తీర్చుకోవాలి" అనుకోవడం మొదలైంది. అదిగో...సరిగ్గా అప్పుడు ఆ అమ్మాయికి పంచరంగుల కలలు రావడం మొదలయింది.

ఆమె కలల్లో నాయకుడు సాధారణంగా డబ్బు వగైరా క్షుద్రబాధలు లేనివాడు. సహజంగానే అందగాడు, సుకుమారుడు. మల్లెపూవులా శుభ్రంగా వుండేవాడు. ప్రేమ వగైరా ఉదాత్త పదాలకు అర్థం తెలిసినవాడు. పరమశాంతుడు. కొన్ని క్షుద్ర విషయాలలో అమాయకుడు. కొంచెం పరధ్యానం మతిమరుపులతో ఆకర్షణీయంగా వుండేవాడు. పైగా మంచి రచయిత. వ్రాస్తూ వ్రాస్తూ ఈ లోకాన్ని, పరిసరాలనూ మరిచిపోయేవాడు.

శ్రీదేవి విశాలాక్షమ్మగారి డాబా గదివైపు చూస్తున్నదల్లా కళ్ళు మరింత పెద్దవి చేసింది. ఆ గది తలుపులు తెరచుకొని ఇప్పుడొక ముసలాయన - నల్లనివాడు గావంచాతో ఇవతలికి వచ్చి పిట్టగోడ పక్కన నిలబడి స్నానానికి ఉపక్రమించాడు.

ఆమె చీకాకు పడుతూ చంకలో పిల్లవాణ్ణి పిర్రమీద ఒక్కటి చరిచి "వెధవా .... ప్రాణాలు తీస్తున్నావు" అని అరిచి లేచి లోపలికి వెళ్ళింది. వాడు ఆ అకారణ దండయాత్రకు భయపడి బ్యా మంటూ ఏడుపు ప్రారంభించాడు.

"ఈ పెద్దదయ్యం ఏదీ? ఇక్కడి కొచ్చినప్పటి నుంచి చూస్తూన్నాను. దీని వరుస. ఒకటే ఆటలు" అని పెద్దగా అరిచింది. ఆమె తల్లీ తండ్రీ పెద్దకొడుకు దగ్గరికి ఏదో అవసరం వస్తే వెళ్ళారు క్రిందటిరోజే. వారు ఇహనో ఇప్పుడో రావాలి.

"పెద్దదయ్యం" అనబడిన శాల్తీపేరు ప్రియంవద. ఎనిమిదేళ్ళ దంతపు బొమ్మ లాంటి పిల్ల. చిన్న కళ్ళజోడుతో, రెండు జడలతో మాతృభూమిని సందర్శించిన ఆనందంతో తల మునకలైపోతూ పొరుగింటి పిల్లలతో కబుర్లు చెబుతున్నది. వారికి తమ బొకారో గురించి తెలిసినవీ తెలియనివీ ఎన్నో అద్భుత విషయాలను చెప్పి అలరిస్తున్నది. తల్లి కేకలకు హడలిపోతూ వచ్చి "ఏంటి మమ్మీ! ఎందుకరుస్తున్నావు?" అన్నది మెల్లగా.

"ఎందుకా?" అంది రుసరుసలాడుతూ శ్రీదేవి. "ఆయనేమో తీరిగ్గా పేపరు పట్టుకుని హాలిడే ఎంజాయ్ చేస్తున్నారు. నువ్వేమో పెత్తనాలకు పోతివి. ఇంటెడు

చాకిరీ చేసుకోవాలి. ఒంటరిదాన్ని. చంటి వెధవ విడిచి పెట్టడంలేదు. ఇహ వంట ఎప్పుడవుతుంది?"

"ఏం చెయ్యమంటావు?" తండ్రి కూతుళ్ళిద్దరూ ఒకేసారి జమిలిగా అన్నారు.

"ఏం చెయ్యమంటానా? నానెత్తినెక్కి డ్యాన్స్ చేయమంటాను. పో... పో...ఆ చంటివాణ్ణి ముందు నా కళ్ళ ముందు నుంచి తీసుకుని ఊరేగు..."

ప్రియంవద పసివాణ్ణి ఎత్తుకుని సముదాయిస్తూ తండ్రివంక సాభిప్రాయంగా నవ్వుతూ చూసింది. తండ్రి కూడా నవ్వాడు.

శ్రీదేవికి వొళ్ళు మండింది. "అట్లా చదివిన పేపరే చదువుతూ కూర్చోకపోతే వెళ్ళి కూరలు తీసుకురారాదూ?" అన్నది గట్టిగా.

అతడు లేచి "వెరీగుడ్. అట్లా కావలిసిందేమిటో చెప్పు నిక్షేపంగా. అంతేకాని ఊరికే రుసరుసలాడకు" అంటూ సంచి అందుకుని డబ్బులు జేబులో వేసుకుని బయలుదేరాడు కళ్ళజోడు సర్దుకుంటూ.

"ఏం తెస్తారు అన్నది శ్రీదేవి.

"పిన్నీసులు అన్నాడు నవ్వుతూ అతడు.

శ్రీదేవికి నవ్వు వచ్చింది. "మీరంతపని చెయ్యగల సమర్థులే గాని వినండి, కూరకి ఏదో ఒకటి - ఇంకా -" అని చెప్పబోతువుండగా అతడు "కూర్చుంటాను ట్యూషన్ చెప్పు." అన్నాడు. ప్రియంవద నవ్వింది. శ్రీదేవి నవ్వింది. ఏదో తెలిసినట్టు చంటివాడు కూడా నవ్వాడు.

తర్వాత శ్రీదేవి స్నానం చేస్తున్నంతసేపు పాత కథనే మననం చేసుకుంది.

ఆ రోజు మరుసటిరోజు కిటికీలో కూర్చుని కూనిరాగాలు తీసింది. ఊహాలోకాల్లోకి తేలిపోయింది. అదంతా అద్భుత ప్రపంచం.

ఆ అబ్బాయి ఆ గదిలోకి ప్రవేశిస్తాడు. కొద్దిపాటి సామానుతో కొని పుస్తకాలు ఒక బల్ల - ఒక కుర్చీ - చిన్న మంచం, రెండు మూడు ఫోటోలు, సూట్‌కేసు, కొన్ని ట్రోఫీలు - ఇతర చిల్లర సామాగ్రి. ఆ కాస్త సామాను సర్దుకోవడం చేతకాక కంగారు పడుతుంటాడు.

తాను విశాలక్ష్మమ్మగారింటికి వెళ్ళి ఆమెతో పాటు పైకి వెళ్ళి అతనికి గది సర్దటంలో సాయపడుతుంది. అతడు మొహాన చెమట తుడుచుకుంటూ "చాలా సాయం చేశారు...థ్యాంక్స్"...అంటాడు.

ఆ తర్వాత వారి పరిచయం పెరుగుతుంది. అటూ ఇటూ పెద్దలు కూడా వారి పరిచయం, స్నేహం చూసి ముచ్చట పడతారు. ఆమె తల్లితండ్రులు "మన పిల్లనిస్తే బాగుండును!" అనుకోవడం, అతని తల్లి తండ్రులు వచ్చి "జాతి రత్నం పిల్లని మనవాడికి చేసుకుంటే బాగుండును" అని ముచ్చట పడడం వగైరా జరుగుతాయి.

అతడు చదివిచదివి అలసిపోయినప్పుడు "చాల్చాలు...ఇహ విశ్రాంతి తీసుకోండి..ఆరోగ్యం పాడవుతుంది." అంటుంది తాను. "అమ్మో విశ్రాంతికి సమయం లేదు"అంటాడు అతను. "మిమ్మల్ని చదవనియ్యనిక..." అంటూ పుస్తకం లాక్కుని

మూసిపడేస్తుంది. "ప్లీజ్" అంటూ వెంటపడి దాన్ని లాక్కుని మళ్ళీ మొదలుపెడతాడు. ఆమె బుంగమూతితో అలిగి కూర్చుంటుంది. అప్పుడతడు చిరునవ్వుతో "సరే...కోపం వచ్చినట్లుంది దేవిగారికి" అంటూ పుస్తకం మూసి మంచమెక్కి "గుడ్‌నైట్" అంటాడు. తాను నవ్వి గుడ్‌నైట్ చెప్పి వచ్చేస్తుంది.

తర్వాత ఒకరోజు తాను వెళ్ళేసరికి ఇంకా మంచం మీదినుంచి లేవకుండా మూలుగుతూ పడుకుని ఉంటాడు. "అరరెరె! ఏమయింది?" అంటూ తాను వెళ్ళి మొహంమీద చెయ్యివేసి చూస్తే పెనంలా కాలిపోతున్నది "అమ్మో! జ్వరం..." అని కంగారు పడుతూ పెద్దలకు చెప్పి డాక్టర్‌ను రప్పిస్తుంది. డాక్టరువచ్చి పరీక్షచేసి "మామూలు ఫీవరే భయంలేదు" అని చెప్పి ఏవో పెద్దలిస్టు మందులువ్రాసి యిచ్చి "తెప్పించి వాడండి రెగ్యులర్‌గా" అని వెళ్ళిపోతాడు. తాను ఇహ రాత్రీ పగలూ అనక అతని మంచం పక్కనే కూర్చుని సమయానికి మందులువేస్తూ అతనికి సపర్యలు చేస్తుంది. రెండు రోజుల తర్వాత అతనికి జ్వరం తగ్గి కళ్ళువిప్పి చూస్తే ప్రక్కన కునికిపాట్లు పడుతున్న తాను, విశాలాక్షమ్మ "రాత్రనక పగలనక కంటిమీద కునుకైనా లేకుండా సపర్యలుచేసి నిన్ను దక్కించుకుంది. ఈ పుణ్యం ఆ శ్రీదేవిదే" అంటుంది. అతడు ఆరాధనా భావంతో ఆమెవైపు చూస్తాడు.

ఈ మధుర ప్రేమగాథ ఆ రెండు రోజుల్లోనూ ఎన్ని వందలసార్లు ఆమె మనోయవనిక మీద ప్రదర్శించబడిందో లెక్కలేదు.

ఆనాడు విశాలాక్షమ్మగారు చెప్పిన మంచిరోజు, ఉదయం నుంచి కాలుగాలిన పిల్లిలాగా తిరిగింది శ్రీదేవి. స్నానం చేసి ఏ దుస్తులు ధరించాలి అనే మీమాంసతో చాలా సేపు తర్కించుకుని వున్న వాటిలో కళ్ళు చెదరగొట్టే వాటిని ధరించింది. దుస్తులు తొడిగిన కుందనపుబొమ్మలా తయారైంది. అప్పుడు మధ్యాహ్నం మూడు గంటల వరకు వర్జ్యమని అమ్మ ఎవరితోనో అనడం విన్నది. మూడుగంటల తరువాత మళ్ళీ అలంకరించుకున్నది. మళ్ళీ కాలుగాలిన పిల్లిలాగా ఇంట్లోకి పెరటిలోకి తిరిగింది.

నాలుగు గంటలు... రోడ్డుమీద వచ్చిన రిక్షా ఆగకుండా నేరుగా వెళ్ళిపోయింది. తర్వాత ఒక లాగుడుబండి...దాని వెంట మళ్ళీ రెండు రిక్షాలు... కొందరు పాదచారులు... స్కూలు పిల్లలు...మధ్య మధ్య ఒక డజను సైకిళ్ళు...అయిదు...ఆరు...ఏడు గంటలయింది. ఏమీ జరగలేదు.

శ్రీదేవి చిరాకు పడింది. "ఛీ ఛీ పిచ్చిదానిలాగా ప్రవర్తిస్తున్నట్టున్నాను" అనుకున్నది. "అలా తోచక బాధపడకపోతే మీ శాంత యింటికి వెళ్ళి రారాదూ?" అన్న తల్లి మాటలు విని "అలాగే" అని బయలుదేరిపోయింది. అక్కడ ఆ కబురూ ఈ కబురూ చెప్పి ఎనిమిది గంటలకు యింటికొచ్చేసరికి విశాలక్షమ్మగారు తమ యింటిలోనే వున్నారు. శ్రీదేవి "ఇవాళ మీ యింటికెవరో అద్దెకొస్తారన్నారుగా!" అని అడిగింది. కుతూహలం పైకి కనబడకుండా జాగ్రత్తపడుతూ.

"అదే చెబుతున్నానమ్మాయీ! ఆ అబ్బాయి మా వారి ఆఫీసుకు వెళ్ళి తాను స్నేహితుడి బలవంతంమీద వేరే గది కుదుర్చుకున్నాననీ ఏమీ అనుకోవద్దనీ చెప్పాట్ట. డబ్బు వాపసు ఇస్తే తీసుకుపోయాట్ట...అఁ ఒక్కరని ఏముంది? ఎవరో ఒకరొస్తారు... మనకు అద్దెరాకపోదు" అన్నది విశాలాక్షమ్మ తేలిగ్గా.

శ్రీదేవికి కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. లోపలికి వెళ్ళి కళ్ళు తుడుచుకుంటూ పక్కమీద కూలబడి నిట్టూర్చింది. కలలో రాజకుమారుడి బొమ్మ మంచు బొమ్మలా కరిగిపోయినట్టయింది.

ఆ తర్వాత ఆ గదిలోకి ఎవరెవరో అద్దెకు దిగారు. మొదట ఒక మధ్య వయస్కుడైన గుమస్తా... కొన్ని నెలలతర్వాత ఒక ప్రభుత్వ ఉద్యోగి...తరువాత ఒక ఒంటరి పంతులమ్మ.. అందరూ వచ్చారు...ఉన్నన్నాళ్ళు ఉన్నారు. తరువాత వెళ్ళారు.

అన్నట్టు ఒక రచయిత కూడా వచ్చి ఆ గదిలో ఆర్నెల్లు కాబోలువున్నాడు. కాని మడ్డి మొహం వాడు. వెధవ అలవాట్లు...మాటిమాటికీ సిగరెట్లు కాల్చడం కిళ్ళీలు నమలడం... పెద్ద గొంతుకతో వారిమీద వీరిమీద కేకలు వేయడం...ఇదీ వరుస... తీరా చేసి వాడు రాసేది తక్కువ రకం పుస్తకాలట. దానికే ఒక మహా రచయిత లాగా పోజూ వాడూనూ...

తర్వాత కొన్ని నెలలకు శ్రీదేవి పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. పెళ్ళయిన వెంటనే వందల మైళ్ళ దూరంలో కొత్తచోట...కొత్త కాపురం...పిల్లలు...అదంతా వేరేకథ.

శ్రీదేవి స్టౌ అంటిస్తున్నదల్లా సవ్వడికి వెనుదిరిగి చూసి బుగ్గలు నొక్కుకుని "అవ్వ! అన్ని కూరలెందుకండి! మార్కెట్టంతా తెచ్చి పడేసినట్టున్నారే..." అన్నది.

అతడు అందంగా నవ్వుతూ "ఉండనియ్! ఇహనో ఇప్పుడో మీ అమ్మా నాన్నా వస్తారు కదా? రెండు రోజులు వెతుక్కోకుండా...నువ్వు రుసరుసలాడకుండా..." అన్నాడు.

శ్రీదేవి క్షణాలమీద వంట పూర్తిచేసింది. పదకొండు కొట్టేసరికల్లా తండ్రి కూతుళ్ళు కంచాలముందు కూర్చున్నారు. శ్రీదేవి వడ్డించింది.

శ్రీదేవి భర్త ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చినవాడిలా "అన్నట్టు ఆ పక్క డాబావుంది చూడు...చాలా ఏళ్ళ క్రితం యూనివర్శిటీలో లాస్టియర్ చదువుతూ పై పోర్షన్‌లో చేరుదామనుకున్నాను. అప్పుడే పై గది కొత్తగా కట్టించారు. అడ్వాన్సు కూడా ఇచ్చాను. యాభై రూపాయిలో ఎంతో. కాని స్నేహితుడు బలవంతం చేస్తే వేరే చోట చేరిపోయాను. రానేలేదు ఇక్కడికి" అన్నాడు.

శ్రీదేవి బుగ్గన వేలు వేసుకుని కళ్ళు పెద్దవి చేసి "నిజమా?" అని అడిగింది.

అతడు "అబద్ధం ఎందుకు చెబుతాను?" అన్నాడు.

◆ ◆ ◆